1988 వినాయక చవితి కాలం దాటవి కథల పోటీలో రు. 75/-లు గెల్చుకున్న కథ.

# గోడమీద బొమ్మ



అది పోలీస్ స్టేషన్...

ఆ గదిలో... కుర్చీలో పెద్ద పులిలా కూర్చున్న పెద్ద దొరగారితోబాటు ముగ్గురు పోలీసులు మూడు వైపులా నిలబడి వున్నారు. ఒక మూల ముద్దలా అపిరయ్య గోడకు చేరగిలబడి వున్నాడు. అదిగో అప్పుడే అపిరయ్య పెళ్ళాం పైడమ్మ, పదేళ్ళ కొడుకు సూరీడు ఆ గదిలోకి అడుగుపెట్టారు.

అపిరయ్యను మాడగానే పైడమ్మకు దుఃఖం ఉప్పెనలా ఉబికి వచ్చింది. కొడుకు సూరీడు కూడా తండ్రిని మాసి ఏడవబోయి వూరుకున్నాడు.

అపిరయ్య, అపిరయ్యలా లేడు. శరీరంలో ఏమూలో జీవం వున్న శవంలా వున్నాడు.

"అపిరయ్య! ఇప్పటికైనా నిజం చెప్పు. అడవిలో వాళ్ళ- స్థావరం ఎక్కడ...? చెప్పకపోయావో నీ పెళ్ళాం బిడ్డల్ని కూడా..."

పెద్ద దొర పెద్దపులిలాగే గాండ్రించాడు...

"సత్తె పెమాణికంగా నాకు తెల్దుబాబో... నన్నొగ్గేయండి నాయనో!" అపిరయ్య ఘొల్లు మన్నాడు.

అపిరయ్యది ఓ అడవి ప్రాంతాన్ని ఆనుకున్న పల్లెటూరు.

నిన్న సాయంత్రం... పైడమ్మ కూలీ పని కెళ్ళింది. కొడుకు సూరీడు బడిలోంచి ఇంకా ఇంటికి రాలేదు. ఒంట్లో నలతగా వుందని, ఇంట్లో నులక మంచంలో పడుకున్న అపిరయ్యను, నలుగురు పోలీసులు వచ్చి బలవంతంగా లాక్కొనిపోయారు. రాత్రంత స్టేషన్లో అపిరయ్య "నాకేం తెలియదంటూ" గోలపెడుతూనే వున్నాడు.

లాఠీలు అపిరయ్య గోలను అసలు వినిపించుకో లేదు. తెల్లారింది. మళ్ళీ అవే ప్రశ్నలు, అదే దబాయింపు. అంతా పోలీసు జులుం.

"నీకూ, ఆ విప్లవకారులకి సంబంధం వుంది. లేకపోతే నీ ఇంటిగోడ మీద ఆ తుపాకీ బొమ్మ ఎలా వచ్చింది?" పోలీసు దొర ఉరిమినట్టే అన్నాడు.

వేలాది పాఠకులు ఉత్కంఠంగా ఎదురుచూస్తున్న పురాణ కథల క్విజ్ ఫలితాలు వచ్చే సంచికలోనే!

అంత నీరసంలోనూ అపిరయ్య ఉలిక్కిపడ్డాడు. పైడమ్మ గుండె గతుక్కుమంది. నిజమే!

తమ ఇంటి మట్టి గోడ మీద ఎవరో ఓ తుపాకీ బొమ్మని ఎర్ర రంగుతో వేశారు. మూడు రోజులుగా ఆ బొమ్మను గమనించినా తామిద్దరూ పట్టించుకోలేదు. ఆ బొమ్మ... ఎంతపని చేసింది?

తమ బతుకులో ఎంత చిచ్చు పెట్టింది...?

వాళ్ళే ఆ అడవిలో వాళ్ళే... ఆ బొమ్మని గీసి...

అపిరయ్య తలను దబదబా గోడకు బాదుకు న్నాడు... పైడమ్మ విలవిలలాడుతూ వుండి పోయింది.

"సమాధానం చెప్పవేరా! దొంగ నా కొడకా... ఆ బొమ్మ నీ యింటి గోడ మీదకెలా వచ్చింది...?" పోలీసు దొరకు బి.పి. పెరిగిపోతోంది.

"ఆ తుపాకీ బొమ్మని మా ఇంటి గోడ మీద ఎర్ర సుద్దతో నేనే గీశానండి" ఆ గదిలో అందరి దృష్టి ఆ వైపు మళ్ళింది...

అపిరయ్య కొడుకు సూరీడు గొంతు స్ఫుటంగా, అమాయకంగా పలికింది.

"నిజవండి! మా బళ్ళో మొన్న 'జై జవాన్' పాఠం చెప్పినారు కదండీ! జవాన్లు తుపాకీలు పట్టుకుని యుద్ధం చేత్తారంటండి... నేనూ పెద్దోణ్ణయి నాక జవాన్నవుతానండి... తుపాకీ పట్టుకుని యుద్ధం చేత్తానండి... తుపాకీ బొమ్మంటే నాకిష్టవండీ... అందుకే పుస్తకంలో బొమ్మను మాసి గోడ మీద..."

ఆ గదిలో రెండు నిమిషాలు నిశ్శబ్దం...

పోలీసులందరి ముఖాలు తెల్లగా పాలిపోయాయి...

"ఈ అపిరయ్యగాణ్ణి ఒదిలేయండి!" పెద్ద దొర చికాకుతో పెద్దగా కేకపెట్టి బయటకు పోయాడు.

పది నిమిషాల తర్వాత అపిరయ్య, పైడమ్మ, సూరీడు పోలీసు స్టేషన్ నుంచి బయటకువచ్చారు... అపిరయ్య మూలుగుతూ భార్య ఆసరాతో నడవలేక నడుస్తున్నాడు. తండ్రిని మాస్తూ వాళ్ళ వెంటే నడుస్తోన్న సూరీడు మనసు మూగవోయినట్టయింది.

ఎప్పుడో బడిలో నేర్చుకున్న 'గోడ మీద బొమ్మ... గొలుసుల బొమ్మ' పాఠం గుర్తుకు రాసాగింది.

సూరీడు వెంటనే ఇంటికి వెళ్ళి గోడ మీద తుపాకీ బొమ్మను చెరిపేయాలనుకున్నాడు.

ఆ తుపాకీ పట్టుకునే వాళ్ళంటేనే, సూరీడుకు పట్టరాని భయం పుట్టుకొచ్చింది.

— శ్రీకంఠ స్ఫూర్తి